# వీడిన మబ్బు

— గోవిందరాజు సీతాదేవి



ఇదిగో అదిగో అనుకుంటూ వుండగానే కొత్త సంవత్సరం ఆనందోత్సాహాల రెక్కలల్లార్చుకుంటూ వచ్చేసింది. అంటే ఒక సంవత్సరం గడిచి మరో సంవత్సరంలోకి అడుగు పెట్టినట్లే. వయసుతోబాటు అనుభవమూ పెరుగుతున్నట్లే. అయితే గత జీవితపు అనుభవాలు భవిష్య జీవితానికి కరదీపికలు కావాలి.

అలా కాకుంటే....

సుధామ చదివే పుస్తకాన్ని మడిచి కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలాడు 'కాలం యెంత విలువైనది! గడచిన క్షణం మరి రాదు.

అయితే ఈ 'కాలం విలువని యెందరు అర్థం చేసుకుంటున్నారు! ఎవరి సంగతో ఎందుకు తన భార్య సుచిత్ర కాలం విలువని అర్థం చేసుకుంటూందా?

సుధామ మనసులో గతకాలపు జ్ఞాపకాల పుటలు తెరుచుకున్నాయి. తమ పెళ్ళి అయి యిప్పటికి ఆరు సంవత్సరాలు గడిచిపోయినాయి. ఆరు సంవత్సరాల 'కాలం' యెంత దీర్ఘమైనది! తమ పెళ్ళి పెద్దలు కుదిర్చినదే. పెళ్ళి చూపులప్పుడు సుచిత్ర తలయెత్తి చూడలేదు. పెదవి కదిపి మాట్లాడలేదు. యిందుకు తను బాధపడలేదు.

ఎంత చదువుకున్న ఆడపిల్లలైనా పెళ్ళి చూపులనేసరికి సిగ్గుపడటం సహజం అనుకున్నాడు. చూడగానే సుచిత్ర నచ్చటంవల్ల పెళ్ళి చాలా క్లుప్తంగా చేయమని చెప్పాడు పెళ్ళికూతురి తండ్రితో. తన మాటకి సుచిత్ర తండ్రి కళ్ళలో కన్పించిన ఆనందభాష్పాలని చూసి తృప్తిగా నవ్వుకున్నాడు. తనకి వయసు ముప్పై నాలుగు. కొన్ని కారణాలవల్ల కాలేజీ లెక్చరర్ వుద్యోగం వున్నా పెళ్ళిని వాయిదా వేసి వేసి చివరికి సుచిత్రని చూసీ చూడగానే ఒప్పుకున్నాడు.

పెళ్ళి అయిపోయింది. తన అన్నా వదినలు యింక 'తమకి శలవు లేదంటూ వెళ్ళిపోయారు. వెడుతూ అన్నాడు అన్నగారు "ఎలాగూ నువ్వు ఇల్లూ ఇంటికి కావల్సిన అవసరాలూ ముందే యేర్పరుచుకున్నావు కనుక సుచిత్రని వెంటనే తీసుకువెళ్ళి కాపురం పెట్టేయి." అని ఆయన బాధ్యత అయిపోయినట్లు వెళ్ళిపోయాడు.

"అల్లుడూ యివాళ ఆ మొదటి రాత్రి వేడుక కానిచ్చేసీ..." అంటూ నసిగాడు మామగారు.

"ఆ యేర్పాట్లు యిక్కడ వద్దు. సుచిత్రని హైదరాబాద్ తీసుకువెళ్ళి అక్కడ నుంచి బెంగళూర్, మైసూర్ హనీమూన్‌కి వెడతాం" అన్నాడు ఈ మాటలు తనే చెప్పవల్సివచ్చినందుకు కాస్త బిడియపడుతూ.

'అలాగే బాబూ! మాకేం అభ్యంతరం లేదు. అలాగే" అంటూ లోపలికి వెళ్ళిన మామగారు గంట గడిచినా బయటకి రాలేదు. వారికోసం ఎదురు చూసి చూసి విసుగెత్తి తనే లోపలి హాలులోకి వెళ్ళాడు,

"మామగారూ"అని పిలుస్తూ.

మామగారు వచ్చి కన్నీళ్ళతో తన చేతులు పట్టుకుని "అల్లుడుగారూ అన్యథా భావించకండి. ఒక్క ఆడపిల్లే కావటాన గారాం చేశాం కాస్త. ఆ గారాం మా కొంప ముంచుతుందని అనుకోలేదు బాబూ" అయన గొంతులో నించి మాటలు రావటంలేదు.

"ఏమైంది?" అర్థం కానట్లు చూస్తూ అడిగాడు.

"అదీ అదీ... మీతో రావటానికి యిష్టపడడం లేదు. నయానా భయానా చెప్పి చూశాం బాబూ"

"అంటే?" అర్థంకాలేదు యింకా సుధామకి.

"అంటే.. మరేంలేదు. కొన్నాళ్ళు ఆగిన తర్వాత... మేం" ఆయన నిలువెల్లా వణకసాగాడు.

సుధామ కనుబొమలు ముడిపడినాయి. మనసు 'షాక్' తిన్నట్లుగా అయింది.

"సుచిత్రతో మాట్లాడాలి" అన్నాడు యెంతో కష్టం మీద.

"అలాగే! సరే... అలాగే" ఆయన ఖంగారుని అణుచుకుంటూ లోపలికి వెళ్ళాడు. పది నిమిషాలు, పావుగంట గడచినా ఆయన రాలేదు.

అసహనాన్ని అణుచుకుంటూ తనే లోపలికి

వెళ్ళాడు.

సుచిత్ర మోకాళ్ళ మీద తల వుంచుకుని కూర్చుని వుంది. తల్లి, దగ్గర కూర్చుని బ్రతిమి లాడుతూ వుంది.

అల్లుడు అక్కడికి రావటం చూసిన ఆవిడ చప్పున లేచి అవతలకి నడిచింది.

"సుచిత్రా" అతి మెల్లగా పిలిచాడు. సుధామ గొంతు విని తృళ్ళిపడి తలెత్తి చూసి టక్కున లేచి నిల్చుంది.

'నువ్వు నా వెంట రావటం లేదూ?" అడిగాడు.

సుచిత్ర మాట్లాడలేదు.

"నాకు జవాబు కావాలి?" రెండు నిమిషాలు వెయిట్ చేసి అన్నాడు.

"........"

"నేను వెళ్ళి పోతున్నాను"

సుచిత్ర వులకలేదు పలకలేదు.

సుధామ ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లుగా ఫీలయిపోయాడు. రక్తం వుడికిపోతుండగా అక్కడ నుంచి బైటకి వచ్చేశాడు. క్షణాల్లో బట్టలు సర్దేసుకుని సూట్‌కేస్ తీసుకుని బైటకి వస్తూంటే మామగారు అల్లుడి చేతిలోని పెట్టెని అందుకో బోయాడు.

సుధామ యివ్వకుండా చక చకా వెళ్ళి ఆటో యెక్కేశాడు.

"అల్లుడుగారూ త్వరలోనే అమ్మాయిని తీసు కుని వచ్చి మీ దగ్గర దించుతాను. మీరు.. మీరు... కోపగించుకోకండి"

సుధామకి ఆయన వినయం చిర్రెత్తిస్తోంది.

"ఈ పెళ్ళి సుచిత్రకి యిష్టంలేదా?" సూటిగా చూస్తూ అడిగాడు. మామగారు జవాబు చెప్ప కుండా తలవంచుకున్నాడు, అపరాధిలా.

"చెప్పండి. ఎందుకు చేశారు?" రెట్టించాడు సుధామ.

"అదేంలేదు బాబూ! అదేం లేదు. కారణం చెప్పమని గద్దిస్తూ మీరడిగితే.. ఏం చెప్పను. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. అందుకనీ.. అందుకనీ..." ఇంక ఆయన నోటి నుంచి ఒక్క అక్షరం బైటకి రాలేదు.

సుధామ ముఖం ఎర్రగా కందిపోయింది.

"కారణం మీరు చెప్పరు నాకూ అర్థంకాదు" అన్నాడు కోపంగా.

• • •

హైదరాబాద్‌లో బస్ దిగి ఆటోలో ఇల్లు చేరే సరికి రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. సూట్‌కేస్ తీసుకుని గేటు దాటి లోపలకి రాబోతుండగా ఎదురుగా కన్పించాయి. "నూతన దంపతులకి స్వాగతం. సుస్వాగతం" అన్న రంగు రంగుల బల్బులతో వెలుగుతున్న వాక్యాలు.

సుధామ భారంగా ఒక్కో అడుగూ వేస్తూ లోపలికి అడుగుపెట్టాడు.

ఇల్లంతా కడిగి ముగ్గులు పెట్టారు. ద్వారాలకి మామిడాకుల తోరణాలు కట్టారు. ఇవన్నీ తన స్నేహితుడు నాగేశ్వరరావు చేసి వుంటాడు అని అర్థమై దీర్ఘంగా నిట్టూరుస్తూ పెట్టె క్రింద పడేసి వాలు కుర్చీలో కూలబడ్డాడు.

"పెళ్ళి కూతురేదీ" నాగేశ్వరరావు చప్పున దగ్గరికి వచ్చి అడిగాడు.

సుధామ కళ్ళు మూసుకునే వుండిపోయాడు.

"అలావున్నావేంరా! ఏం జరిగింది! ఇద్దరం ఒస్తున్నాం అని ఫోన్ చేశావుగా."

సుధామ మౌనం నాగేశ్వరరావుని భయపెట్ట సాగింది.

'యేదో జరగరానిది జరిగి వుంటుంది.' అను కుంటూ టీ చేసి తెచ్చి యిచ్చాడు.

"ఒద్దురా!" సుధామ టీ కప్పు అందుకోలేదు.

"అలా అనకు. అంత దూరంనించి ప్రయాణం చేసి ఒచ్చావు ప్లీజ్ తీసుకో" నాగేశ్వరరావు ప్రాధేయపడుతూంటే సుధామ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎలాగో లేచి కూర్చుని టీ తాగాడు.



**మహిళలు మాత్రమే!**

మహిళల కోసం– ప్రత్యేకించి పూర్తిగా మహిళలే నిర్వహించే "బోర్డింగ్ కమ్ లాడ్జింగ్"లు అమెరికాలో ఒకటి, తూర్పు జర్మనీలో ఒకటి, లండన నగరంలో ఒకటి మొత్తం ప్రపంచ వ్యాప్తంగా ఈ మూడు చోట్లనే ఉన్నాయి.

ఈ హోటల్స్‌లో– మగవారికి ప్రవేశం లేదు. మగవారిని అసలు ఈ హోటల్స్‌కే రానివ్వరు. మేనేజర్ మొదలుకొని సప్లయర్ వరకూ ఈ హోటల్స్‌లో అందరూ మహిళలే.

–డా॥ శివ, బషీరాబాద్

"సుధామా! డైనింగ్ టేబుల్ మీద అన్నీ రెడీగా పెట్టాను. కాస్సేపు ఆగి స్నానంచేసి భోజనం చెయ్యి. యిదిగో నీ ఇంటి తాళం చెవులు" అని అందించి వెళ్ళిపోతూ అనుకున్నాడు,

'వీడిని యివాళ ఒంటరిగా ఒదిలేసి విషయం రేపు కనుక్కునే ప్రయత్నం చేయటం మంచిది' అని. నాగేశ్వరరావు వెళ్ళిపోయాడు.

సుధామ అలా చాలాసేపు కూర్చుని లేచి బట్టలు మార్చుకుని స్నానం చేసి అప్పుడు వచ్చాడు బెడ్‌రూములోకి. గది కిటికీ తలుపులు తెరిచే వున్నాయి. ఆరు బైట వెన్నెల శ్వేత సముద్రంలా పొంగి పొరలుతూ వుంది. అక్కడక్కడ ఆకాశంలో నక్షత్రాలు జరీ చుక్కల్లా మెరుస్తున్నాయి. కిటికీ దగ్గరగా వున్న కొబ్బరిచెట్టు చిరుగాలికి కదులుతూ తన వైపు ఆసక్తిగా తొంగి తొంగి చూస్తున్నట్లుగా అన్పించసాగింది. మంచం మీద పరిచిన మల్లెలనీ గులాబీ రెక్కలనీ విసుగ్గా కిందకి తోసేసి దిండు మీద వాలిపోయాడు.

తను ఈ రోజు కోసం యెన్నెన్నో కలలు కన్నాడు. ఇల్లాలిని తెచ్చుకునే ముందే ఇంటికి కావల్సిన అన్ని సామానులనీ అమర్చుకుని శాంతిగా ఆనందంగా దాంపత్య జీవితం గడపాలని పెళ్ళిని చాలా సంవత్సరాలు వాయిదా వేశాడు. అనుకున్నట్టుగా అన్నీ కూర్చుకునీ సుచిత్ర మెడలో మంగళ సూత్రం కట్టాడు. కానీ విధి వెక్కిరించి నట్లు యెందుకిలా జరిగింది. సుచిత్ర రానన టానికి కారణం ఏమిటి? వాళ్ళు చెప్పరు. తనకి అర్థం కాదు. యెలా? సుధామ తల వేడెక్కి పోయింది. కాలం కరిగి కరిగి సాగిపోతూనే వుంది.

• • •

సుధామ నాలుగు రోజులు కాలేజీకి వెళ్ళలేదు. శలవు కాన్సిల్ చేసుకుని కాలేజీకి వచ్చిన సుధామకి శుభాకాంక్షలు తెల్పుతూ తోటి లెక్చరర్లు అడిగారు

"మిసెస్ సుధామని యెప్పుడు చూపిస్తారు"

"రాలేదు. వచ్చిన తర్వాత..."

"యెప్పుడొస్తారు?" మరో ప్రశ్న.

"చెప్తాను కదూ" అంటూ వారిని తప్పించు కోవడం కష్టమైపోయింది సుధామకి.

రోజులు గడుస్తున్నాయి. క్యాలెండరులో కాయితాలు మారిపోతూన్నాయి. కానీ మామగారి నుంచి వుత్తరం లేదు. సుధామ మనసులో పెళ్ళి కూతురు అలంకరణలో అందంగా మెరిసి పోతూన్న పెళ్ళనాటి సుచిత్ర మెదులుతూంది. ఒక్కో పండగా వస్తోంది. వెడుతోంది. కానీ సుచిత్ర రాలేదు.

ఆలోచించి అహంభావాన్ని పక్కకి పెట్టి ఉగాది పండగకి నూతన సంవత్సరం గ్రీటింగ్ పంపాడు సుచిత్రకి. దానికీ జవాబులేదు.

"అంకుల్! వేపపూత పచ్చడి యిచ్చి రమ్మన్నది మా అమ్మ" ఎదురింటి అయిదేళ్ళ హారతి పిలుపుకి సుధామ వులిక్కిపడి గతంలోనించి ప్రస్తుతానికి వచ్చాడు. ఆ అమ్మాయి యిచ్చిన వేపపూత పచ్చడి తిని ఆ పిల్లకి బిస్కెట్లు యిచ్చి పంపాడు. మనసు ఆలోచనల మించి మరలించుకోవాలి. యింక సుచిత్ర కోసం యిలా యెదురు చూడటం అనవసరమేమో! అనుకుని లాయరు దగ్గరకి వెళ్ళి విడాకులకి ప్రయత్నించటం మంచిది, అని బయలుదేరాడు అంతలోనే ఆ అభిప్రాయాన్ని మార్చుకుని వచ్చి సుచిత్రకి వుత్తరం రాశాడు. జవాబు రాలేదు.

మరి కొన్ని నెలలు గడిచిపోయాయి. సుధామ లాయరు దగ్గరకి వెళ్ళాడు.

• • •

దెబ్బకి దెయ్యం పారిపోయిందన్న సామెతగా అల్లుడి నుంచి రిజిష్టర్ నోటీసు అందగానే మామ గారి దగ్గరినించి సుధామకి వుత్తరం వచ్చేసింది.

"సుచిత్రని తీసుకొని వస్తున్నాను. బస్టాండ్‌కి రండి" అంటూ.

"సుచిత్ర వస్తోందా! ఇది నిజమా!" వుత్తరం అందుకున్న సుధామ మనసు ఆనందంతో గంతులు వేసింది. బస్‌స్టాండుకు వెళ్ళాడు. తండ్రి వెనక బస్సు దిగిన సుచిత్ర తలెత్తి తనని చూడనే లేదు. మనసులో సూదులు గుచ్చుకున్నంత బాధ అయినా భరిస్తూ ఇంటికి తీసుకువచ్చాడు.

ఆ రోజంతా యాంత్రికంగానే గడిచింది.

"నేను వెళ్ళి పోతున్నాను అల్లుడుగారూ, చూడండీ. సుచిత్ర చిన్న పిల్ల అని నేను అనను. మేం చెప్పవల్సిందంతా చెప్పాం. మీరు కాస్త ఓపిక పట్టి దాన్ని దారిలోకి తెచ్చుకోండి. ఇంతకుమించి నేను యింకేం చెయ్యలేను" అన్నాడు చేతులు పట్టుకుని. సుధామకి కోపం కట్టలు తెంచుకుంది. "చూడండి! సుచిత్రకి యిష్టంలేని పెళ్ళి చేయటం మీ మొదటి తప్పు.

ఈ కారణంగా నా జీవితం వ్యథలపాలు చేయటం రెండో తప్పు. బలవంతంగా యిలా నా దగ్గరకి తీసుకువచ్చి దించటం మూడోతప్పు.

మీ తప్పులకి నేను బాధ్యత వహించను. నాకా అవసరంలేదు. ఈసమస్యకి విడాకులే పరిష్కారం. మీ అమ్మాయిని తీసుకువెళ్ళిపోండి" ఆవేశంగా అన్నాడు.

"బాబూ మీ కాళ్ళు పట్టుకుంటాను. అలా అనకండి. వెధవ నవలలూ కథలూ వెర్రిగా చదివి 'ప్రేమా' 'దోమా' అంటూ పిచ్చి పిచ్చి ఆలోచనలు పెంచుకుని భగవంతుడిచ్చిన అదృష్టాన్ని, మంచి మనసున్న మిమ్మల్ని గుర్తించలేక పోతూన్న ఆ పిచ్చి పిల్ల మీద జాలి పడుబాబూ!

"ఒక రోజు కాకుంటే ఒకరోజు దాని అభిప్రాయాలు పిచ్చివనీ మీ కాళ్ళు పట్టుకునే రోజు వస్తుందన్న నమ్మకం నాకుంది అల్లుడుగారూ! అందుకే కాస్త ఓపిక పట్టమని మరీ మరీ ప్రాధేయ పడుతున్నాను. ఆడపిల్ల తండ్రిగా నేచెప్పే మాటల వెనకవున్న బాధ అర్థంచేసుకోమని అర్థిస్తున్నాను."

"చూడండీ! ఆ పాతకాలం మాటలు నాకు చెప్పవద్దు. సుచిత్రని నా దగ్గర వదలటం మాత్రమే తండ్రిగా మీ బాధ్యత కాదు. ఆమె మనసు యిష్టపడేలా చేయండి. నాకే అభ్యంతరంలేదు" విసుగ్గా అన్నాడు.

"విజ్ఞత తెల్సిన మీరూ అలా అంటే నా గతేంకాను. అలా అనకండి. సుచిత్ర మీ అర్థాంగే" అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

ఇంత జరుగుతున్నా చూస్తూ నిలుచుందే కానీ సుచిత్ర వులకలేదు. పలకలేదు.

సుధామకి ఒళ్ళూ మనసూ మండిపోసాగాయి. యిప్పుడేం చేయటం. తలపట్టుకుని కూర్చుండిపోయాడు. నాలుగురోజులు అతిభారంగా గడిచిపోయాయి. సుచిత్రలో మార్పులేదు.

సుధామ తనే వంట చేసి తను భోజనం చేసి కాలేజీకి వెడుతూన్నాడు. వస్తూన్నాడు.

సుచిత్ర యెంచక్కా భోజనం చేసి యేవో తను తెచ్చుకున్న పుస్తకాలు చదివేస్తూ కూర్చుంటోంది. లేకుంటే టీవీ పెట్టుకుని చూస్తుంది. అంతే.

సుచిత్ర వచ్చిందని సుధామ చెప్పకున్నా కాలేజీలో అందరికీ తెల్సిపోయింది. యిది మరీ బాధ కల్గిస్తోంది. ఈ బాధని పోగొట్టుకునే మార్గం. ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చి ఇంటికి వచ్చాడు.

సుచిత్ర యేదో పుస్తకం దీక్షగా చదవటంలో మునిగిపోయిందల్లా సుధామ బూట్ల శబ్దానికి పుస్తకం మూసి లేచి నిల్చుంది.

"ఏమిటి అవన్నీ" టీపాయ్ మీద పెట్టి వున్న ప్రజంటేషన్స్ పాకెట్లని చూస్తూ అడిగాడు.

"మీ స్నేహితులట, ఓ నలుగురు వచ్చి యిచ్చి వెళ్ళారు." సుధామ తల బాదుకున్నాడు.

"ఇప్పటికే సమయం మించిపోయింది. ఇంక ఆలశ్యం చెయ్యకూడదు" అవేశాన్ని అణుచుకుని, "సుచిత్రా కూర్చో నీతో మాట్లాడాలి" అంటూ తను ఓ కుర్చీలో కూర్చున్నాడు.



**తాళికట్టేది ఆడదే!**

మొగుడి మెడవంచి భార్యే తాళిని బిగించి ముడివేసే సంప్రదాయం మరెక్కడో కాదు... మన దేశంలోనే ఉంది. అస్సాం రాష్ట్రంలోని దట్టమైన అడవి ప్రాంతాలలో "కరోస్ - శాసిస్" అన్న ఆదివాసీ తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు.

వీరి సంప్రదాయం ప్రకారం వధువే - వరుడి మెడలో తాళి కడుతుంది. ఇంతటితో అయిపోలేదు. వివాహనంతరం వరుడే వధువు ఇంటికి వెళ్ళి అత్త ఇంట కాపురం జీవితాంతం వెలగబెట్ట వలసిందే!

—డా॥ శివ, బషీరాబాద్

సుచిత్ర సుధామ ముఖంలోకి చూసింది చెప్పండి అన్నట్టుగా.

"సుచిత్రా పెళ్ళి కాకముందు యెవరినో యిష్ట పడవచ్చు. అతన్ని పెళ్ళాడాలి అనీ అనుకోవచ్చు అవన్నీ జరగకపోవచ్చు. గతం మరవటం కష్టం అని నీకనిపించినప్పుడు మరో వ్యక్తిని నువ్వు పెళ్ళాడకూడదు. గత్యంతరంలేక పెళ్ళాడినా నీ కలలు నిజం కాలేదన్న బాధతో భర్తని సాధించటం సబబేనా?"

సుచిత్ర తలవంచుకుంది.

సుధామలో సహనం నశించింది.

"సుచిత్రా నీ బట్టలు సర్దుకో! మీ నాన్న గారింటికి వెడుదువుగాని"

"ఆ పని చేయకండి. వాళ్లు పరువు పోతుందని వురిపెట్టుకుంటారు" గాభరాగా చూస్తూ అంది.

"ఇక్కడ నా పరువు పోదా!"

"అవును. నేను ఇదీ ఆలోచిస్తూన్నాను"

"వూ! యెన్ని సంవత్సరాలైనా నీ ఆలోచనలు సాగుతూనే వుంటాయి. ఈ సమస్యకి పరిష్కారం నేను చెప్తాను. చూడూ నువ్వు కావాలనుకున్న అతను యెక్కడవుంటాడో చెప్పు. నిన్ను పంపేస్తాను" బాధని అణుచుకుంటూ అన్నాడు.

"నిజంగా! నన్ను. మీరు... పంపే...స్తారు?" ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"నిజంగా పంపేస్తాను. చెప్పు. అతను యెక్కడ వుంటాడు?"

"ఈ వూళ్ళోనే"

"అయితే వెంటనే బయలుదేరు సుచిత్రా. ఆటో తెస్తాను. నిన్ను అతని దగ్గర భద్రంగా దించుతాను"

సుధామ లేచి చెప్పులు వేసుకోబోయాడు.

సుచిత్ర కదలలేదు. మెదలలేదు.

"సుచిత్రా..." మరోసారి చెప్పాడు.

"నేను వెళ్లను"

"ఎందుకనీ?" కోపాన్ని అతికష్టంమీద కంట్రోల్ చేసుకుంటూ అన్నాడు.

"నాకు... అతను... అక్కరలేదు"

చాచి చెంప పగలకొట్టాలన్నంత ఆవేశం వచ్చేసింది. అయినా తనని తను సంబాళించుకుంటూ "పాత చింతకాయ పచ్చడి కబుర్లు నాకు నచ్చవు" అన్నాడు.

"ఇది వరకు నాకూ నచ్చేవి కావు. కానీ ఇది జీవితం. అదీ ఈ జీవితంలో అనుకున్నవన్నీ జరగవనీ జరగని వాటి కోసం కాలాన్ని వ్యర్థం చేసుకోకూడదనీ నాకిప్పుడిప్పుడే అర్థం అవుతూ వుంది. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణ ప్రేమగా భ్రమించి ఎండమావుల వెంట పరుగెత్తాలని ప్రయత్నించి ఎదురు దెబ్బ తగిలి బోర్లాపడ్డ నాకు మనసు కుదుట పర్చుకోవటానికి చాలానే టైము పట్టింది. మంచితనమూ సంస్కారమూ వున్న మీరు నాకు భర్తగా దొరకటం చాలా అదృష్టం అని అమ్మా నాన్నా చెపున్నా నేనూ కొంత గ్రహించినా యిక్కడికి వచ్చిన తర్వాత నాకు మీ మీద గౌరవం మరీ పెరిగింది. యిందాక మీరన్న ఒక్కమాట మనసు మీద పన్నీరు జల్లు కురిపించింది."

సుచిత్ర కళ్ళలో నీళ్ళు నిండుతూండగా ఒక్కో అడుగూ వేస్తూ సుధామ దగ్గరగా వచ్చింది.

సుధామకి తల గిర గిరా తిరిగి పోతూన్నట్లే అన్పించసాగింది.

"ఏమిటా మాట?"

"నేను కావాలని అనుకున్నది యెవరైనా సరే అతని దగ్గరకి పంపిస్తానని. ఆ ఒక్కమాట చాలు మీ మంచి మనసు తెలియటానికి.." సుచిత్ర చప్పున వచ్చి అతన్ని హత్తుకుపోయింది.

ఇది నిజమా! కలా! అర్థం కావటంలేదు సుధామకి. అప్పటి వరకూ వున్న కోపం ఎక్కడికి ఎగిరి చక్కాపోయిందో! అతనికే తెలియదు. సుచిత్రని ప్రేమగా గుండెలకి హత్తుకున్నాడు.